క్లుప్తంగా

తల్లిపాలతో బిడ్డకు వ్యాధినిరోధకశక్తి

చాగలమర్రి: తల్లిపాలు బిడ్డకు వ్యాధినిరోధక శక్తిని పెంపొందిస్తాయని జెడ్పీటీసీ సభ్యురాలు జి.లక్ష్మీదేవి అన్నారు. సోమవారం స్థానిక మల్లెం వీధిలోనున్న 16వ అంగన్‌వాడీ కేంద్రంలో 1,2,4,6,16 కేంద్రాలకు సంబంధించి తల్లి పాల వారోత్సవాల కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. వైస్ ఎంపీపీ ముల్లా.రఫీ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుశీలమ్మతో కలిసి వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను పంపిణీ చేశారు. అలాగే కోటగడ్డ వీధిలో వున్న 9,10 అంగన్‌వాడీ కేంద్రాల్లో వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను వి.మహబుబ్‌షరీఫ్, ముల్లా.గౌస్‌పీర్ పంపిణీ చేశారు.

గోస్పాడు: సంపూర్ణ పోషణతో ఆరోగ్యం చేకూరుతుందని ఉపసర్పంచ్ బొక్కెం నాగేశ్వరరెడ్డి అన్నారు. మండలంలోని యాళ్లూరు గ్రామంలో అంగన్‌వాడీ సిబ్బంది ఆధ్వర్యంలో గర్భిణులు, బాలింతలకు సోమవారం సంపూర్ణ పోషణ కిట్లను అందజేశారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని క్రాంతినగర్‌లోనున్న ఏపీ మోడల్ స్కూల్‌లో హిరోషిమా, నాగసాకియా దినోత్సవం సందర్భంగా జిల్లా సైన్స్ కో ఆర్డినేటర్ కేవీ సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో సోమవారం విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. అనంతరం విజేతలకు మెరిట్ సర్టిఫికెట్లు, బహుమతులను ప్రిన్సిపాల్ ఎస్.ఫర్హానా బేగం అందజేశారు.

అభివృద్ధి పనులకు భూమి పూజ

నంద్యాల(సిటీ): పట్టణంలోని అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేస్తున్నామని మున్సిపల్ చైర్‌పర్సన్ షేక్ మాబున్నిసా అన్నారు. సోమవారం 15వవార్డు రెవెన్యూక్వార్టర్స్‌లో కౌన్సిలర్ అనూష,వార్డు ఇన్‌చార్జ్ సాయిరాంరెడ్డితో కలిసి పలు అభివృద్ధి పనులను భూమిపూజ చేశారు.

మురుగు కాలువ సమస్యపై విచారణ

ఉయ్యాలవాడ : మండల కేంద్రంలో నెలకొన్న మురుగు కాలువ సమస్యపై తహసీల్దార్ రవికుమార్ బాధిత రైతులతో సోమవారం విచారణ చేపట్టారు. స్థానిక బస్టాండ్ నుంచి కుందూనది వరకు గ్రామం నుంచి ప్రధాన మురుగు కాలువ నీటితో పదేళ్ల నుంచి తమ పంట పొలాలు దెబ్బతింటున్నాయని, మురుగు నీరును పొలాల్లోకి రాకుండా చూడాలని బాధిత రైతులు రెండు వారాల క్రితం నంద్యాల జిల్లా కేంద్రంలో కలెక్టర్ నిర్వహించే స్పందన కార్యక్రమంలో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు తహసీల్దార్ కార్యాలయంలో రైతులు గుండం శ్రీనివాస రెడ్డి, ఎగ్గోని వెంకటరెడ్డి, కమతం తులశన్న తదితరులతో విచారణ చేపట్టారు. మంగళవారం క్షేత్రస్థాయిలో రైతుల పొలాలను పరిశీలిస్తామని తహసీల్దార్ పేర్కొన్నారు. ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు, ఈఓపీఆర్డీ వెంకటేశ్వర్లు, పంచాయతీ కార్యదర్శి జయరామిరెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఫణీకృష్ణ పాల్గొన్నారు.

అన్నదానం



అన్నదానం చేస్తున్న దృశ్యం

నంద్యాల(అర్బన్): కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించే స్పందన కార్యక్రమానికి వచ్చే అర్జీదారులకు సోమవారం ఆల్‌మదద్ కంప్యూటర్ సెంటర్ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. జెడ్పీసీఈఓ సుబ్బారెడ్డి, జిల్లా కో ఆపరేటివ్ ఆఫీసర్ వెంకటసుబ్బయ్య, మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి, ఆల్ మదద్ ఫౌండేషన్ ఇన్‌చార్జ్ ఆకుమల్ల రహీం అన్నదానం కార్యక్రమాన్ని ప్రారంభించారు.

13న మాదిగ లాయర్ల జాతీయ సదస్సు

నంద్యాల(వ్యవసాయం): మాదిగ లాయర్స్ ఫెడరేషన్ జాతీయ కమిటీ ఆధ్వర్యంలో 9వ జాతీయ సదస్సు ఈనెల 13వ తేదీన విజయవాడలో నిర్వహిస్తున్నట్లు నంద్యాల మాదిగ లాయర్స్ ఫెడరేషన్ సభ్యులు వెంకటేశ్వర్లు, జయకర్, ప్రసాదరావు సోమవారం తెలిపారు. వారు మాట్లాడుతూ ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టాలని డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య

రుద్రవరం: మండలంలోని హరినగరం గ్రామానికి చెందిన వలంటీర్ వెంకటయ్య (35) అనే వ్యక్తి సోమవారం ఇంట్లో పైకప్పుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కాలనీ వాసులు తెలిపిన వివరాల మేరకు.. మూడేళ్లుగా భార్యభర్తలు విడిపోయి జీవనం కొనసాగిస్తున్నారు. భార్య కాపురానికి రాకపోవడంతో మద్యానికి బానిసయ్యాడు. మూడేళ్లు దాటినప్పటికి ఆమె తిరిగి రాకపోవడంతో మనస్తాపానికి గురై అఘాయిత్యానికి పాల్పడినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శరత్‌కుమార్‌రెడ్డి తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలి

నంద్యాల(న్యూటౌన్): మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. అలాగే..ఆశా వర్కర్లపై పని భారం తగ్గించాలని ఏఐటీయూసీ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. వీఆర్ఏలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలంటూ సీఐటీయూ ఆధ్వర్యంలో గ్రామ తలారీలు సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట రిలే దీక్షలు చేపట్టారు.

మోదీ పతనానికి నాంది

ఈనెల 9వ తేదీన విజయవాడలో మహాకార్మిక గర్జన..కార్మిక వ్యతిరేకి మోదీ పతనానికి నాంది పలుకుతుందని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి రమేష్‌బాబు అన్నారు. సోమవారం పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు.

బీజేపీకి చెంపపెట్టు..

నంద్యాల(అర్బన్): రాహుల్‌గాంధీకి లోక్‌సభ సభ్యత్వం పునరుద్ధరణ బీజేపీ ప్రభుత్వానికి చెంప పెట్టులాంటిదని ఏపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతలమోహన్‌రావు పేర్కొన్నారు.

వయ్యారి.. బహు ప్రమాదకారి

- వయ్యారిభామ గడ్డితో రైతులు, పాడిపశువులకు అనర్థాలు
- పలు పంటల్లో ఫలదీకరణపై ప్రతికూల ప్రభావం
- వైరస్‌లకు ఆవాసాలుగా పార్థీనియం మొక్కలు
- నిర్మూలించకుంటే విశృంఖలంగా విస్తరించే గుణం



వయ్యారిభామ కలుపు మొక్కల విస్తృతి దృశ్యం



వయ్యారిభామ కలుపుమొక్క

నంద్యాల(సెంట్రల్): సాగులో ఫలవంతమైన దిగుబడులు పొందాలంటే విత్తనం, ఎరువులు, పురుగు మందుల యాజమాన్యం ఎంత ముఖ్యమో కలుపు మొక్కల నివారణకూ అంతే ప్రాధాన్యముంది. అన్ని కలుపు మొక్కలు కేవలం పైరుకు హానిచేస్తే, ఓ రకం మొక్క మాత్రం పంటతో పాటు మనుషులు, పశువులకు సైతం ప్రమాదకారిగా పరిణమించింది. అదే వయ్యారిభామ (పార్థీనియం) గడ్డి. కాంగ్రెస్ గడ్డి, క్యారెట్ గడ్డి, నక్షత్రగడ్డి, అమెరికా అమ్మాయి ఇలా వివిధ పేర్లతో పిలవబడే ఈ పరాన్నజీవి కలగజేసే నష్టం అపారం.

అమెరికాలో పుట్టి...

1950లో అమెరికా నుంచి దిగుమతి చేసుకున్న గోధుమలతో ఈ విత్తనం మన దేశంలోకి ప్రవేశించింది. అనతికాలంలోనే అంతటా విస్తరించింది. బంజరు, పంట భూములు, జనావాసాలు, రోడ్లు, రైల్వే ట్రాక్‌లు, పెట్రోల్ బంకులు, కాల్వలు, పొలాల గట్లపై, బీడు భూములు, బస్‌స్టాపులు, పాడుబడిన ప్రదేశాల్లో వయ్యారిభామ మొక్కలు పెరుగుతాయి. ఇది ఏకవార్షిక మొక్క. 90 నుంచి 150 సెం.మీ. ఎత్తు ఉంటుంది. ఒక్కో మొక్క 50 నుంచి 80 వేల విత్తనాల్ని ఉత్పత్తి చేస్తుంది. హానికారకమైన రసాయనాలతో ఉండే ఈ మొక్కలను జంతువులు తినలేకపోవటం, అన్ని రకాల వాతావరణ పరిస్థితుల్ని తట్టుకునే కణజాల వ్యవస్థ ఉండటంతో వయ్యారిభామ విస్తరించటానికి దోహదం చేస్తోంది.

వైరస్‌లకు ఆశ్రయం..

పార్థీనియం పంటలకే కాదు మనుషులకు, జంతువులకు ఎంతో హాని చేస్తుంది. పక్కన ఉండే మొక్కలపై దీని రసాయనాల ప్రభావం పడి ఎదుగుదల తగ్గుతుంది. పొలాల్లో 40 శాతం, పశుగ్రాస పంటల్లో 90 శాతం వరకు దిగుబడి తగ్గుతుంది. దీంతో పాటు కొన్ని రకాల వైరస్‌లకు ఇది ఆశ్రయమిస్తూ పంటలకు వ్యాప్తి చెందటానికి కారణమవుతోంది. ఈ మొక్కతో మనుషులకు డెర్మటైటిస్ లేదా ఎగ్జిమా, అతిజ్వరం, ఉబ్బసం వంటి రుగ్మతలు వస్తాయి. పుష్పాల పొడి పీలిస్తే జలుబు, కండ్లు ఎర్రబడటం వంటి లక్షణాలు కలుగుతాయి. ఆకులు తగిలితే తామర వంటి అంటు వ్యాధులు సంభవిస్తాయి. పశువుల ఆరోగ్యాన్ని దెబ్బతీస్తుంది. పొరపాటున పశువులు గడ్డితో పాటు మేస్తే పాల దిగుబడి తగ్గటంతో పాటు వచ్చే అరకొర పాలు సైతం చేదుగా ఉంటాయి. అంతేకాక వెంట్రుకలు రాలిపోవటం హైపర్‌టెన్షన్‌కు గురవుతాయి.

యాజమాన్య పద్ధతులు..

వయ్యారిభామ మొక్క పూతకు రాకముందే పీకి తగులబెట్టడం లేదా కంపోస్ట్ తయారు చేయాలి. పంట మార్పిడి విధానాన్ని బంతి పంటతో చేయడంతో ఈ మొక్కల ఉధృతిని తగ్గించవచ్చు. క్రైసోమిలిడ్ జాతికి చెందిన జైగోగ్రామ బైకొలరెటా అనే పెంకు పురుగులు ఈ మొక్కల్ని విపరీతంగా తిని ఈనెలు మాత్రమే వదిలిపెడతాయి. పార్థీనియం నివారణలో ఈ పెంకు పురుగులు ప్రముఖ పాత్ర వహిస్తాయి. ఒక ఆడ పెంకు పురుగు ఆకుల అడుగు భాగంలో 1500 నుంచి 1800 వరకు గుడ్లు పెట్టి పొదగటంతో పిల్లలు నాలుగైదు రోజుల్లో బయటికి వస్తాయి. జూన్ నుంచి అక్టోబర్ వరకు మాత్రమే ఈ మొక్కలపై పెంకు పురుగులు కనిపిస్తాయి. రైతులు కలుపు మొక్కలపై వీటిని గమనిస్తే పురుగు మందులు చల్లకుండా అలాగే పెరగటానికి అవకాశం ఇవ్వాలి. వయ్యారిభామ మొక్కలకు కొన్ని రకాల ఆకుమచ్చ తెగుళ్లు, బూడిద తెగులు, ఎండు తెగులు ఆశిస్తాయి. వాటిని గుర్తించినప్పుడు ఆ మొక్కను పీకేయకుండా ఉంచాలి. దీంతో ఇతర వయ్యారిభామ మొక్కలకు ఆ తెగుళ్లు ఆశించి నాశనం చేస్తాయి. కసివింద(కస్సియ సెరిషియా) జాతికి చెందిన కలుపు మొక్కలు వయ్యారిభామ మొక్కలతో పాటు పెరుగుతాయి. కసివింద మొక్కలు స్రవించే కొన్ని రసాయనాలు వయ్యారిభామ మొక్క పెరుగుదలను బీజోత్పత్తి శక్తిని తగ్గిస్తాయి. కసివిందతో పాటు వెంపలి కూడా ఇదే రకమైన ప్రభావాన్ని కలిగించి ఆ మొక్కల పెరుగుదలను తగ్గిస్తాయి.

రసాయన పద్ధతులు..

రసాయనిక పద్ధతుల ద్వారా కలుపు మొక్కలను తాత్కాలికంగా మాత్రమే నిరోధించగలం. సాధ్యమైనంత వరకు తక్కువగా వాడాలి. కలుపు నాశక మందులు వాడాలంటే వాటికి సంబంధించిన సాంకేతిక పరిజ్ఞానం, నైపుణ్యంతో పాటు జాగ్రత్తగా వ్యవహరించాలి. వయ్యారిభామ కలుపు నివారణకు గ్లైఫోసైట్ 10 మి.లీ. లీటర్ నీటికి లేదా పారక్వాట్ 5 నుంచి 7 మి.లీ. లీటర్ నీటికి కలిపి మొలకెత్తిన 15-20 రోజుల్లో ఎకరా విస్తీర్ణంలో 200 లీటర్ల మందు ద్రావణాన్ని పిచికారీ చేయాలి.

సామాజిక బాధ్యతగా తీసుకోవాలి



పార్థీనియం మొక్కల నిర్మూలనను రైతులంతా సామూహికంగా చేపట్టాలి. సామాజిక బాధ్యతగా భావించి సరైన చర్యలు చేపడితే ఈ మొక్కలు పూర్తిగా లేకుండా చేయవచ్చు. రోడ్ల పక్కన, ఇంటి పరిసరాల్లో లీటర్ నీటికి 5 గ్రాముల చొప్పున అట్రాజిన్ కలుపు మందును కలిపి పిచికారీ చేయాలి. వేసవిలో లోతు దుక్కులు చేస్తే కొంత వరకు నివారించవచ్చు. – డాక్టర్ సరళమ్మ, సమన్వయకర్త, ఏరువాక కేంద్రం, నంద్యాల

డీలర్లకు ఎరువులు కేటాయించాలి

నంద్యాల(అర్బన్): కంపెనీల ఎరువుల కేటాయింపుల్లో ఫాం ఓ ఉన్న హోల్‌సేల్ డీలర్లందరికీ సమానంగా కేటాయింపులు జరిగేలా కంపెనీ సేల్స్ మేనేజర్లకు సూచించాలని మండల వ్యవసాయాధికారి ప్రసాదరావు తెలిపారు. హోల్‌సేల్ డీలర్లు.. రిటైల్ డీలర్లకు ఎరువులు ఇచ్చేటప్పుడు ఇతర ఎరువులను కచ్చితంగా తీసుకోవాలని గానీ, అధిక ధరలకు తీసుకోమని ఒత్తిడి తెస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. స్థానిక ఏఓ కార్యాలయంలో సోమవారం నంద్యాల మండలంలోని హోల్‌సేల్ డీలర్లు, ఎరువుల కంపెనీల సేల్స్ మేనేజర్లతో సమావేశం నిర్వహించారు. ఏఓ మాట్లాడుతూ ఎరువుల వ్యాగన్ వచ్చేటప్పుడు 2, 3రోజుల ముందుగానే ముందస్తు ఎరువుల పంపిణీ ప్రణాళికను అందజేయాలని ఆదేశించారు. ఏఈఓ మణిమోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

స్పందన సమస్యలను పరిష్కరించాలి

గోస్పాడు: స్పందన సమస్యలను అధికారులు, సిబ్బంది వెంటనే పరిస్కరించాలని ఇన్‌చార్జ్ తహసీల్దార్ విజయశేఖర్ సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలు స్పందనలో అర్జీ అందజేస్తే పరిష్కారం చూపేందుకు చొరవ చూపాలని, ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. రెవెన్యూ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందించాలని, సమయపాలన పాటించాలని ఆదేశించారు. గ్రామాల్లో నిర్వహిస్తున్న ఓటర్ల ఇంటింటి సర్వేలో ఓటర్ల వివరాలు సక్రమంగా నమోదు చేయాలని చెప్పారు.

నేడు వార్డు సభ్యుల ఎన్నికకు నామినేషన్లు

ఉయ్యాలవాడ : మండలంలోని నర్సిపల్లె, హరివరం గ్రామ పంచాయతీల్లో 5,7 వార్డు సభ్యుల పదవులకు గాను మంగళవారం నుంచి నామినేషన్లు స్వీకరిస్తామని ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు సోమవారం తెలిపారు. ఆయా గ్రామ పంచాయతీ ల్లోని వార్డు సభ్యులైన ముల్లా మహబూబ్‌బాషా, తొగట సుబ్బ రామయ్య అనారోగ్యంతో మృతి చెందడంతో ఎన్నిక అనివార్యమైందన్నారు.

శిరివెళ్ల: మండలంలో ఖాళీగానున్న గ్రామ పంచాయతీల వార్డు మెంబర్ల ఎన్నికకు ఈ నెల 8వ తేదీన నోటిఫికేషన్ జారీ అవుతుందని ఏంపీడీఓ సుబ్రహ్మణ్యం సోమవారం తెలిపారు. యర్రగుంట్ల మేజర్ గ్రామ పంచాయతీలో 8 వార్డు మెంబర్ గుత్తి శంకరయ్య, వనికినిదిన్నె 5 వార్డు మెంబర్ బడితెల కుమారి మరణించారు. అలాగే గుంప్రమాన్‌దిన్నె 12 వార్డు మెంబర్ నాగలక్ష్మి రాజీనామా చేయగా ఎన్నిక అనివార్యమైంది.

దొర్నిపాడు: మండలంలోని అర్జునాపురం గ్రామంలోని వార్డు-1కి ఎన్నికల ప్రటన వెలుబడినట్లు ఎంపీడీఓ సుబ్బారెడ్డి సోమవారం తెలిపారు.

రుద్రవరం: వార్డు సభ్యుల ఎన్నికకు సంబంధించి ఎంపీడీఓ మధుసూదన్‌రెడ్డి సోమవారం మాట్లాడుతూ మండలంలోని పేరూరు 5వ వార్డు, ఆర్.నాగులవరంలో 7వ వార్డు, నర్సాపురంలో 10 వార్డు సభ్యుల స్థానాలు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. కాగా.. అన్ని వార్డు స్థానాలకు.. ఈనెల 8నుంచి 10వరకు నామినేషనుల స్వీకరణ, 11న పరిశీలన 14న నామినేషన్ల ఉపసంహరణ, 19న ఎన్నికలు, అదేరోజు లెక్కింపు, ఫలితాలు వెల్లడిస్తామని ఆయా మండలాల అధికారులు తెలిపారు.

రాష్ట్రంలో సంక్షేమ విప్లవం

ఆళ్లగడ్డ: సంక్షేమ సారథి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నాయకత్వంలో దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో సంక్షేమ విప్లవం కొనసాగుతోందని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం పట్టణంలోని విజయపురి, జమునావీధి, శోబారాణి వీధి, కొత్త మసీదు ప్రాంతాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించంఆరు. అలాగే.. సాయంత్రం చింతకుంట గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల లబ్ధిని వివరించి, లబ్ధిదారులకు బుక్‌లెట్‌లను అందజేశారు. ప్రజలు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకురావడంతో సత్వరమే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో కుల మతాలు, పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా సిఫారసులు లేకుండా సంక్షేమ పథకాలు నేరుగా అర్హులకు అందేలా జగనన్న పాలన సాగిస్తున్నారని చెప్పారు. పార్టీ పట్టణ ఇన్‌చార్జ్ సుధాకర్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ నాయబ్‌రసూల్ సింగం వెంకటేశ్వర్‌రెడ్డి, నజీర్, రంగేశ్వర్‌రెడ్డి, పలచాని మల్లికార్జునరెడ్డి, ఇంజేటి నాగిరెడ్డి, శివనాగిరెడ్డి, శంకర్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, రాజారెడ్డి, చంద్రారెడ్డి, కౌన్సిలర్‌లు వరప్రసాద్‌రెడ్డి, నరసింహులు, మహబూబ్‌బాషా ఉన్నారు.



మహిళలకు పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి

నంద్యాల వైద్యురాలికి జాతీయస్థాయి పురస్కారం

నంద్యాలటౌన్: నంద్యాల జిల్లాకు చెందిన ఫిజియో డాక్టర్ రోహిణి విజయ్‌కి జాతీయ ఫిజియో డాక్టర్ల మహాసభలో ఉమెన్ ఆఫ్ అచీవ్‌మెంట్ పుస్కారంతో సన్మానించారని ఏపీఐఏపీ అధ్యక్షుడు కిషోర్ కుమార్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 5,6 తేదీలో ఢిల్లీలో నిర్వహించిన మహాసభలో నంద్యాల జిల్లా ఫిజియో డాక్టర్స్ అసోసియేషన్ సభ్యురాలైన డాక్టర్ రోహిణి విజయ్ వైద్య రంగానికి చేసిన సేవలకు గాను జాతీయస్థాయిలో పురస్కారం లభించడం, అలాగే మహాసభలకు జిల్లాకు చెందిన వైద్యుడు కాటసాని శివబాలిరెడ్డి న్యాయ నిర్ణేతగా వ్యవహరించడం సంతోషకరమన్నారు.



డాక్టర్ రోహిణి విజయ్‌కి ప్రశంసా పత్రం అందజేస్తున్న దృశ్యం

ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనం వైద్య కళాశాల

నంద్యాలటౌన్: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనం.. నంద్యాలలో మెడికల్ కాలేజీ నిర్మించడమేనని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిశోర్‌రెడ్డి అన్నారు. సోమవారంతుది దశ నిర్మాణ పనులు జరుగుతున్న వైద్య కళాశాలను సందర్శించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ స్వర్ణలతతో కలిసి అత్యాధునిక సాంకేతికతతో నిర్మించిన ల్యాబ్‌లు, కాన్ఫరెన్స్ హాల్, బోధనా తరగతులు, ఆఫీస్‌రూమ్స్‌ను పరిశీలించారు. అనంతరం అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎవరు ఎన్ని అడ్డంకులు సృష్టించినా నంద్యాలలో వైద్య కళాశాల నిర్మాణం ఎట్టి పరిస్థితుల్లో ఆగకూడదని పనులు చేయిస్తున్నామన్నారు. ఇప్పటికే 150 సీట్లు మంజూరయ్యాయని, తరగతుల నిర్వహణకు కూడా అనుమతులు వచ్చాయన్నారు. త్వరలోనే అడ్మిషన్లు నిర్వహించి తరగతులు ప్రారంభిస్తామన్నారు. మునిసిపల్ వైస్ చైర్మన్ పాంషావలి, నాయకులు అనిల్ అమృతరాజ్, జీకీర్, లక్ష్మినారాయణ, కిరణ్, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఆనందకుమార్ పాల్గొన్నారు.



తరగతి గదిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శిల్పారవి



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

అధికారంలో ఉన్నప్పుడు సీమకు ఏం చేశారు?

- పదవిలో లేకపోతే రాయలసీమపై ప్రేమ పుట్టుకొస్తుందా బాబూ?
- ప్రజలను మభ్యపెట్టేందుకే 'ప్రాజెక్టుల సందర్శన'



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి

ఆళ్లగడ్డ: ముఖ్యమంత్రిగా ఉన్నన్ని రోజులు చంద్రబాబు నాయుడుకు దేశంలో అత్యంత వెనుకబడిన రాయలసీమ అభివృద్ధి పట్టదు కానీ.. అధికారంలో లేకపోతే మాత్రం ఈ ప్రాంతంపై ఎక్కడ లేని ప్రేమ కురిపిస్తున్నారని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి ఎద్దేవా చేశారు. మీరు అధికారంలో ఉన్నప్పుడు ఈ ప్రాంతానికి ఏం చేశారో చెప్పాలని ప్రశ్నించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో సోమవారాం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రిగా ఉన్న రాయలసీమ ప్రాజెక్టులను ఏమాత్రం పట్టించుకోకుండా రాయలసీమ ద్రోహిగా మిగిలిపోయారన్నారు. వైఎస్సార్ సమయంలో రాయలసీమ రైతులకు జీవన్మరణ సమస్యగా ఉన్న పోతిరెడ్డిపాడును విస్తరించేందుకు చర్యలు తీసుకుంటుంటే ప్రతి పక్ష ఎమ్మెల్యేగా ఉన్న దేవినేని ఉమ పోతిరెడ్డిపాడు పనులు ఆపకపోతే తల కాయలు తీసుకుపోతామని హెచ్చరించిన వ్యక్తిని మందలించాల్సింది పోయి.. అధికారంలోకి వచ్చిన వెంటనే నీటిపారుదల శాఖ మంత్రిని చేసిన చరిత్రను తాము మరిచిపోలేదన్నారు. నీ నీరు – చెట్టు పేరుతో నిధులు దండుకోవడం తప్ప చిత్త శుద్ధితో పనులు పూర్తి చేసి నీళ్లు పారించిన పాపన పోలేదని విరుచుకు పడ్డారు. మీ సుదీర్ఘ పరిపాలనలో రాయలసీమకు ఒక్క ప్రాజెక్టుకు ఒరగబెట్టింది లేదని, ఇప్పుడు ప్రాజెక్టుల సందర్శన పేరుతో రావడం సిగ్గుచేటన్నారు. ఎన్నికలు మరో ఆరు నెలల్లో వస్తున్నాయని, ప్రజలను మరోసారి మభ్యపెట్టేందుకు రాయలసీమ ప్రాజెక్టుల సందర్శన అని కొత్త డ్రామాకు తెరలేపారని ఎద్దేవా చేశారు. పోలీసులపై దాడులు చేయండి అని ప్రోత్సహించడం సిగ్గు చేటన్నారు. స్థానికంగా ఓ నాయకురాలు ఉందని.. ఆమె మాట్లాడుతూ..సీఎం జగన్ ఆళ్లగడ్డకు చేసిన వాగ్దానాలు ఏమయ్యాయని ప్రశ్నించడం సిగ్గుచేటన్నా రు. నిధుల మంజూరుకు విధివిధానాలుంటాయని మంత్రిగా చేసిన ఆమెకు తెలియకపోవడం విచారకరమన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కింద అభివృద్ధి నిధులు పట్టణంలోని ప్రతి సచివాలయానికి మంజూరు చేశామన్నారు. నీవు మంత్రిగా ఉన్న సమయంలో నియోజకవర్గ అభివృద్ధికి ఏమి వెలగబెట్టావో చెప్పగలవా అంటూ ప్రశ్నించారు. అధికారలో ఉన్నప్పుడు తెలుగుంగంగ అభివృద్ధి చేయాలని అనిపించలేదా నిలదీశారు. మహారాష్ట్ర, కర్ణాటక నుంచి మినుములు తెచ్చి రైతుల పేరుతో విక్రయించి దోచుకున్నది ఎవరో అందరికీ తెలుసన్నారు. చౌకబారు విమర్శలు చేయడం మానుకోవాలని హితువు పలికారు. నాయకులు నరసింహారెడ్డి, సుధాకర్‌రెడ్డి, లాయర్ అశ్వర్థరెడ్డి, రామకృష్ణ ఉన్నారు.

హైకోర్టు జడ్జిని కలిసిన న్యాయవాదులు



హైకోర్టు జడ్జికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న నంద్యాల బార్ అసోసియేషన్ నాయకులు

నంద్యాల(వ్యవసాయం): ఏపీ హైకోర్టు రిజిస్ట్రార్, ఏపీ జ్యుడీషియల్ అకాడమీ చైర్మన్ హరిహరశర్మను సోమవారం నంద్యాల బార్ అసోసియేషన్ నాయకులు స్థానిక ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం బార్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు విజయశేఖర్‌రెడ్డి, ప్రతాపరెడ్డి మాట్లాడుతూ హైకోర్టు రిజిస్ట్రార్ మహానందిలో ప్రత్యేక పూజలు నిర్వహించి కర్నూలుకు వెళ్లారు. వైఎస్సార్‌సీపీ జిల్లా లీగల్‌సెల్ అధ్యక్షుడు రామసుబ్బయ్య, వాసగిరి కృష్ణ లింగయ్య, శ్రీనివాసమూర్తి, కృష్ణ, హృదయకృష్ణ, రాజేశ్వరి ఉన్నారు.

ప్రజాసంక్షేమం కోసమే గడప గడపకు..

నంద్యాల(సిటీ): ప్రజా సంక్షేమమే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమ ఉద్దేశమని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం 38వ వార్డు వైఎస్సార్ నగర్‌లో కౌన్సిలర్ సావిత్రమ్మ, వార్డు ఇన్‌చార్జ్ రమణతో కలిసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ముందుగా వార్డులో నెలకొన్న సమస్యలపై స్థానికులను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా నేరుగా లబ్ధిదారులకు సంక్షేమ ఫలాలను అందించిన ఘనత మన ముఖ్యమంత్రి జగనన్నకే దక్కుతుందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చి ప్రతి గడపలో సంతోషాలను నింపుతున్నారన్నారు. అంతకుముందు కాలనీకి చేరుకున్న ఆయనకు స్థానికులు ఘన స్వాగతం పలికారు. చైర్‌పర్సన్ షేక్ మాబున్నిసా, నాయకులు అంకాలయ్య, బాబురావు, తిరుపతయ్య, జాకీర్ హుస్సేన్, అన్వర్ బాషా, రామకృష్ణారెడ్డి, ప్రసాద్ రెడ్డి, పుల్లమ్మ, వెంకటస్వామి, ఆచారి, రాము, ఉమాకాంతయ్య, బాబు, చిరు, సోమశేఖర్, శివ, గోరే, ముర్తుజా, చెన్నప్ప పాల్గొన్నారు.




వృద్ధుడికి మిఠాయి తినిపిస్తున్న ఎమ్మెల్యే

గద్దర్‌కు నివాళి

నంద్యాల(న్యూటౌన్): సీపీఐ, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో సోమవారం స్థానిక కార్యాలయంలో ఏపీ ప్రజానాట్య మండలి అధ్యక్షతన ప్రజా నాయకుడు గద్దర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి శివయ్య మాట్లాడుతూ తన ఆటపాటలతో ప్రజలను చైతన్య పరిచారని గుర్తు చేశారు. కళాకారులే కాకుండా ఎందరో సాహిత్య అభిమానులకు, సంగీత ప్రియులను తన ఆట,పాటలతో ఆకట్టుకున్నారన్నారు. సుబ్బారెడ్డి, కాలింగ్ రాముడు, కళాకారులు పెద్దయ్య, జమ్మన్న పాల్గొన్నారు. అలాగే.. గద్దర్ మృతి ప్రజా ఉద్యమాలకు తీరని లోటని సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి రంగనాయుడు, బాబాఫక్రుద్దీన్, రాధాకృష్ణ, సుబ్బరాయుడు పేర్కొన్నారు. సోమవారం స్థానిక కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. దప్పు ఖలీల్, రమేష్, హబీబ్ పాల్గొన్నారు.

నంద్యాల(వ్యవసాయం): ఆధునిక వాగ్గేయకారుడు, జానపద కళారూపాలతో చైతన్యం కలిగించి ఉద్యమ స్ఫూర్తి రగిలించిన మహోన్నత వ్యక్తి గద్దర్ అని కళారాధన సాంస్కృతిక సంస్థ గౌరవాధ్యక్షుడు డాక్టర్ మధుసూదన్‌రావు, ప్రధాన కార్యదర్శి డాక్టర్ రవికృష్ణ కొనియాడారు. సోమవారం కళారాధన సాంస్కృతిక కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.



నివాళులర్పిస్తున్న ప్రజానాట్య మండలి నాయకులు

వ్యక్తికి జైలు శిక్ష

నంద్యాల(వ్యవసాయం): మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తికి సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ రామిరెడ్డిగారి రాంభూపాల్‌రెడ్డి సోమవారం జైలు శిక్ష విధించారని కోర్టు పోలీసులు తెలిపారు. వివరాలు.. షేక్ మాబాషా ఆదివారం టెక్కె సుంకులమ్మ వీధిలో రాత్రి సమయంలో దారిన పోయే మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తుండటంతో స్థానికులు టూటౌన్ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వెంటనే పోలీసులు అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరచగా రెండురోజులు జైలుశిక్ష విధించారని చెప్పారు.

రాయల పాలన ఆదర్శం

ఉయ్యాలవాడ: శ్రీకృష్ణదేవరాయుల పాలన ఎన్నటికీ ఆదర్శమేనని బలిజ సంఘం అధ్యక్షుడు ఆకుల వెంకటసుబ్బయ్య, కోశాధికారి అర్జిగారి నరసింహుడులు కొనియాడారు. సోమవారం కృష్ణదేవరాయుల పట్టాభిషేక మహోత్సవ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక కమతం వీధిలో ఏర్పాటు చేసిన రాయల విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గౌరవాధ్యక్షులు వెంకటస్వామి, కమతం రాముడు, కస్తూరి రాముడు, కమతం తొలిశన్న, ఆకుల శ్రీనివాసులు, మల్లికార్జున పాల్గొన్నారు.

వ్యవసాయాధికారులకు శిక్షణ

నంద్యాల(సెంట్రల్): రైతులు తెచ్చే ఎరువులు, పురుగు మందుల నమూనాల పరీక్షల్లో అగ్రిల్యాబ్‌లు సమర్థంగా పనిచేస్తున్నాయని జిల్లా వ్యవసాయ శాఖాధికారి మోహనరావు తెలిపారు. సోమవారం నంద్యాల అగ్రిల్యాబ్‌లో విత్తన, ఎరువు, మట్టి పరీక్షల నమూనా సేకరణలపై 6 నియోజకవర్గాల మండల వ్యవసాయాధికారులు, విస్తరణాధికారులకు ఆరు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ...రైతులు పరీక్షల నిమిత్తం తెచ్చిన నమూనాల ఫలితాలు వారంలోపు అందజేస్తున్నామన్నారు. నంద్యాల ల్యాబ్ వ్యాపార నమూనాల్లో 499 పరీక్షలు చేసి రాష్ట్రంలో మొదటి స్థానాన్ని పొందిందని గుర్తు చేశారు. విత్తనాలకు సంబంధించి మొలకశాతం, తేమశాతం, జన్యు స్వచ్ఛత, ఎరువులకు సంబంధించి నత్రజని, భాస్వరం, పొటాషియం తదితర పోషకాల స్థాయి గుర్తింపు కచ్చితత్వంతో చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఆరు రోజుల శిక్షణ కార్యక్రమాల్లో భాగంగా మొదటి రెండు రోజులు విత్తనం, తర్వాత మూడు రోజులు ఎరువులు, చివరిరోజు మట్టిపై రిసోర్స్ పర్సన్స్ ఏఓ నాగేంద్రప్రసాద్, వెంకటేశ్వర రెడ్డి, ఉషారాణి శిక్షణ ఇస్తారన్నారు. నంద్యాల ఏడీఏ(ఇన్‌చార్జ్) హేమసుందరరెడ్డి, ఏఓ ప్రసాదరావు, పలు మండలాల ఏఓలు, ఏఈఓలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ శాఖాధికారి మోహనరావు

గుడ్‌షెప్పర్డ్ స్కూల్ యాజమాన్యంపై కేసు నమోదు

బొమ్మలసత్రం: నంద్యాల పట్టణంలోని ఎస్బీఐ కాలనీలోనున్న గుడ్‌షెప్పర్డ్ స్కూల్ యజమాని జెస్సిపాల్, న్యాయవాది పీవీ సుబ్బారెడ్డిపై పోలీసులు కేసు నమోదు చేశారు. టూటౌన్ సీఐ ప్రభాకర్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. నడిగడ్డ వీధికి చెందిన అస్లాం బాషాకు ఎస్బీఐ కాలనీలోని గుడ్‌షెప్పర్డ్ స్కూల్ వద్ద కొంత స్థలం ఉంది. అయితే స్కూల్ యాజమాన్యం ఆ స్థలం తమదేనంటూ అస్లాంబాషాను బెదిరింపులకు గురిచేశారు. బాధితుడు టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయటంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

వీసీ కాలనీలో చైన్ స్నాచింగ్..

త్రీటౌన్ పరిధిలోని వీసీ కాలనీలో కిరాణం షాపులో ఉన్న పద్మావతి అనే మహిళ మెడలో నుంచి ఇద్దరు గుర్తుతెలియని యువకులు చైన్ తెంచుకొని పారిపోయారు. నాలుగు తులాల బంగారు గొలుసు అపహరించారని సీఐ నరసింహులు తెలిపారు.